క్లుప్తంగా

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దపప్పూరు: మాఘమాసం మొదటి ఆదివారం అశ్వత్థం తిరునాల సందర్భంగా భక్తుల నుంచి హుండీల ద్వారా వచ్చిన ముడుపులు, కానుకలను సోమవారం దేవదాయశాఖ స్పెషలాఫీసర్ వన్నూరు స్వామి, ఈఓ సుబ్రమణ్యం లెక్కించగా రూ.4,91,527లు ఆదాయం వచ్చింది. గత ఏడాది కన్నా తొలి వారం ఆదాయం ఎక్కువ వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గార్లదిన్నె బీసీ రామక్రిష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రూ.6.50 లక్షలు పలికిన టెంకాయల వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ ఆవరణలో ఏడాది పాటు టెంకాయల విక్రయానికి నిర్వహించిన వేలం రూ.6.50 లక్షలకు దక్కించుకున్నారు. ఈఓ రామాంజనేయులు, ఇన్‌స్పెక్టర్ రాణి ఆధ్వర్యంలో సోమవారం టెంకాయ విక్రయ వేలం నిర్వహించారు. ఆరుగురు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. ఈ నెల 15 నుంచి 2026 పుష్యమాసం నెలాఖరు వరకూ ఏడాది పాటు ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి వేలం నిర్వహించగా మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన బీరప్ప రూ.6.50 లక్షలకు దక్కించుకున్నాడు. అలాగే ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించే బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు టెంకాయల విక్రయానికి రూ.3.05 లక్షలకు రఘునాథ్‌రెడ్డి అనే వ్యక్తి వేలంలో దక్కించుకున్నాడు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రంగస్వామిరెడ్డి యాదవ్, డేగామద్దిలేటి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు ప్రారంభం




శింగనమలలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందులు కొనుగోలు చేస్తున్న అధికారులు

శింగనమల: శింగనమలలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందులు కొనుగోలును సోమవారం ప్రారంభించినట్లు ఏఓ అన్వేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఖరీఫ్‌లో కంది సాగు చేసి రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకున్న రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్వింటాల్ రూ.7,550కు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు మొదట శాంపిల్స్ తీసుకువచ్చి మార్క్‌ఫెడ్ అధికారి శివారెడ్డి, సిబ్బందికి చూపించాలన్నారు. మార్క్‌ఫెడ్ గోడౌన్ శింగనమలలోని రాచేపల్లి రోడ్డుకు ఉందన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా 122 మంది రైతులు 955 క్వింటాళ్ల కందుల కొనుగోలుకు నమోదు చేసుకున్నారన్నారు.

సహజ ప్రసవాలు ఆరోగ్యకరం

గుత్తి: సహజ ప్రసవాలు తల్లీ బిడ్డల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగంగా ఉంటాయని ప్రభుత్వ వైద్యురాలు పవిత్ర అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో సహజ ప్రసవాలపై బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గైనిక్ డాక్టర్ పవిత్ర మాట్లాడారు. సిజేరియన్ ప్రసవాల ద్వారా తల్లీ బిడ్డల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. సహజ ప్రసవాల వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు.రూ. వేలకు వేలు ఖర్చు చేసి సీజేరియన్ ఆపరేషన్‌లు చేయించుకుని అనారోగ్యం పాలు కావద్దని ఆమె సూచించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

యల్లనూరు: చిలమకూరు గ్రామ సమీపంలో నూతనంగా రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను సోమవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు, రైతుల సౌకర్యార్థం సబ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో చిలమకూరు సర్పంచు పెద్ద నాగరాజు, ఈఈలు రాజశేఖర్, మోహనమ్మ, ఈఈ ఎంఆర్‌టి రవిశంకర్, డీఈఈ వసంతయ్య, కన్‌స్ట్రక్షన్ డీఈ రంగస్వామి, ఏఈ పద్మనాభరెడ్డి, కాంట్రాక్టరు విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న అడవి పందులు



- పంటలు నాశనం చేస్తుండటంతో రైతుల ఆందోళన
- పొలం చుట్టూ చీరలు, మైకుల ఏర్పాటు
- పంటలు కాపాడుకునేందుకు అన్నదాతల అవస్థలు



చందన, పచ్చారుమేకలపల్లికి వెళ్లే రహదారిలో మొక్కజొన్న పంట చుట్టూ చీరలు కట్టిన దృశ్యం

యాడికి: అడవి పందుల నుంచి పంటలు కాపాడేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా పందులు పంటలపై దాడిచేసి నాశనం చేస్తూ అన్నదాతలకు తీవ్ర నష్టం చేస్తున్నాయి. యాడికి మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో రైతులు పప్పుశనగ, మొక్కజొన్న, వరి కూరగాయల పంటలను సాగు చేశారు. పంట చేతి కొచ్చే దశలో అడవి పందులతో పాటు జింకలు నష్టం చేకూరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో చేసేదేమీ లేక రాత్రి, పగలు పంట వద్దే కాపలా ఉంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జింకలు, రాత్రి వేళ అడవి పందులు తిరుగుతూ చేతికొచ్చిన పంటలను తినేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల వద్దకు కాపలా వెళ్లినప్పుడు అడవి పందులు దాడులు చేస్తున్నాయని, అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. కాగా పంటలను అడవి పందుల నుంచి రక్షించుకోవడానికి వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేశారు.

పొలాల చుట్టూ చీరలు

సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించి పొలాల చుట్టూ రైతులు కర్రలను పాతి పాత చీరలను కట్టాలి. అడవి పందులు రాత్రి వేళ పంటలపై దాడి చేసినప్పుడు చీరల స్పర్శ తగిలి మనుషులు ఉన్నట్లు భ్రమపడి భయంతో అరుస్తూ దూరంగా పరుగెత్తుతాయి. క్షౌరశాలలో లభించే వ్యర్థమైన వెంట్రుకలు సేకరించి, పొలాల్లో గట్ల చుట్టూ ఒక్క అడుగు వెడల్పు ప్రాంతాన్ని చదును చేసి వెంట్రుకలను పల్చగా చల్లాలి.



మైక్‌లతో భారీ శబ్ధాలు

అడవి పందుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు టపాకాయలు పేల్చడం, ఖాళీ డబ్బాలతో శబ్దాలు చేయాలి. క్రూరమృగాలు, కుక్కల అరుపులను రికార్డింగ్ చేసి మైక్ ద్వారా రాత్రి సమయంలో పొలంలో పెట్టాలి. పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు కాకుండా సోలార్ తీగలు అమర్చుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం



మొక్కజొన్న, వేరుశనగ, పెద్ద జొన్న పంటల రక్షణ కోసం రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పంటలను అడవి జంతువుల బారి నుంచి కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే జంతువులతో పాటు మనుషుల ప్రాణాలకు ప్రమాదం.

– మహబూబ్‌బాషా, ఏఓ, యాడికి

సోలార్ కంచెల ఏర్పాటు



మొక్కజొన్న, వేరుశనగ, పప్పుశనగ పంటలను సాగు చేస్తున్నాం. అధికారుల సలహాలు పాటిస్తూ అడవి జంతువుల నుంచి రక్షణగా పంటల చుట్టూ సోలార్ కంచెలను ఏర్పాటు చేసుకున్నాం. రాత్రి మైక్‌లు ఏర్పాటు చేసి జంతువుల శబ్దాలు చేస్తున్నాం. దీంతో జంతువులు గట్ల వద్దకు రావడం లేదు.

– కోనా వెంకటశివారెడ్డి, కోనుప్పలపాడు



తెల్ల కుసుమ సాగు చేయాలి

వేరుశనగ పంట చుట్టూ 4–5 వరుసలు కుసుమ పంట సాగు చేస్తే వాటికి ఉండే సన్నని ముళ్ల వల్ల అడవి పందులు వచ్చి ముట్టెతో భూమిని తవ్వడానికి ప్రయత్నించినపుడు ఆ ముళ్లు గుచ్చుకుని తీవ్రనొప్పి వస్తుంది. దీంతో అడవి పందులు తవ్వవు. మొక్కజొన్న చుట్టూ 4–5 వరసలతో ఆముదపు పంట సాగు చేస్తే ఆ వాసనకు జొన్న వైపు రావని అధికారులు సూచిస్తున్నారు.

అంగన్‌వాడీ భవన సమస్యపై నివేదిక ఇవ్వండి

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో 18 ఏళ్ల కిందట నిర్మించి వదిలేసిన అంగన్‌వాడీ భవనంపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆదేశించారు. సోమవారం సాక్షి దిన పత్రికలో 'అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు' అన్న కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. అచ్యుతాపురం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యను ఎమ్మెల్యే బండారు శ్రావణి దృష్టికి అంగన్‌వాడీ వర్కర్ విజయలక్ష్మి తీసుకెళ్లింది. ఎమ్మెల్యే స్పందించి నిర్మించిన భవనంపై నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. మౌలిక వసతులు కల్పించి, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తే గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

పీఏబీఆర్ సందర్శన



పీఏబీఆర్ వద్ద ఎస్ఆర్ఐటీ కళాశాల విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు కొర్రకోడులోని పెన్నఅహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)ను సందర్శించారు. డ్యాం వద్ద సాంకేతిక, నిర్మాణ విభాగాలను పరిశీలించారు. ప్రాంతీయ విద్యుత్ ఉత్పత్తి, నీటి నిర్వహణలో దాని పాత్రపై వివరాలు తెలుసుకున్నారు. రిజర్వాయర్ రెండు కరువు పీడిత జిల్లాలకు తాగునీటిని ఎలా సరఫరా చేస్తోందో విద్యార్థులకు ఇంజినీర్లు వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ హరి ప్రసాద్‌రెడ్డి, అరుణ కుమారి, హెచ్ఎల్‌సీ పీఏబీఆర్ ఇంజినీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ 'ఫీజు పోరు'కు తరలిరండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: పెండింగ్‌లో ఉన్న రూ.3,900 కోట్ల ఫీజు బకాయిలను సాధన కోసం మార్చి 12న అనంతపురంలో వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న ఫీజు పోరు ర్యాలీ, నిరసన కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా తరలిరావాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీయాదవ్, నియోజకవర్గం అధ్యక్షుడు నక్కా నారప్ప పిలుపునిచ్చారు. సోమవారం వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు పట్టణంలోని పలు జూనియర్ కాలేజీలకు వెళ్లి ఫీజు పోరు కార్యక్రమం గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేయాలనే కుట్రలో భాగంగానే ఫీజు బకాయిలను విడుదల చేయకుండా వేధిస్తోందన్నారు. ఫీజు బకాయిలను సాధించే వరకూ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వాల్మీకిసాయి, అశోక్, మణి, శివ, యశ్వంత్, అజయ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

శింగనమలకు రహదారి సమస్య తీర్చండి

శింగనమల: 544–డీ అనంతపురం– విజయవాడ రహదారి నుంచి నియోజకవర్గ కేంద్రమైన శింగనమలకు దారి చూపకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని, మా రహదారి సమస్యను తీర్చాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రహదారి సమస్య తేల్చకుండా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తున్నారని, శింగనమల నుంచి అనంతపురం వెళ్లాలన్నా, తాడిపత్రి నుంచి శింగనమల వైపు రావాలన్నా ఎక్కడ క్రాస్ కావాలని ప్రశ్నించారు. అండర్ లెవల్ బ్రిడ్జి నిర్మించి ఉంటే , ప్రమాదాలు జరకుండా ఉండేవని, నియోజకవర్గ కేంద్రం ఉందా లేదా అన్నట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ప్రజల ఇబ్బందులు ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్నారు. శింగనమలకు రహదారి సమస్యను వెంటనే పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన సేవలను గుర్తు చేసుకుని, ప్రస్తుతం రోడ్డు నిర్మాణం ఇంజనీర్లు ప్రజలకు ఉపయోగపడేలా రోడ్డు నిర్మాణం పనులు చేప్టాలని కోరారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



రోడ్డు ప్రమాదం జరిగిన దృశ్యం

గుత్తి: పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ రోడ్డులో కేంద్రీయ విద్యాలయం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. మంత్రాలయం నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీ కొంది. ప్రమాదంలో కారు డ్రైవర్, మరో వ్యక్తితో పాటు మహిళ గాయపడింది. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్‌లో నుంచి కింద పడి..

గుత్తి ఆర్ఎస్‌లోని చెట్నేపల్లి బ్రిడ్జి వద్ద మట్టిలోడు ట్రాక్టర్ రైల్వే ట్రాక్ ఎక్కుతున్న సమయంలో.. ట్రాక్టర్ అదుపు తప్పి గుంతలో పడింది. ప్రాణ భయంతో ట్రాలీలో కూర్చున్న రవి కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.




గాయపడిన డ్రైవర్ రవి

రోడ్డు నిబంధనలు పాటించాలి

గుంతకల్లు: వాహనాదారులు ట్రాఫిక్ రూల్స్‌ను ఖచ్చితంగా పాటించాలని గుంతకల్లు ఎంవీఐ నీలం వెంకట రాజాబాబు సూచించారు. శనివారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో లైసెన్సులు కోసం వచ్చిన వారికి రోడ్డు భద్రత నియామాలను వివరించారు. నిబంధనలు పాటించకుండా ర్యాష్ డ్రైవింగ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేయడం, త్రిబుల్ రైడింగ్ వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో వాహనాదారులు, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ఉద్యమాలు ఉధృతం



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వ అసమర్థతతో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని శింగనమల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి నారాయణస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వాల్మీకి దేవాలయంలో సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గొప్పలు చెప్పడమే గానీ ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్షుడిగా సాకే భాస్కర్, కార్యదర్శిగా వెంకట రాముడు, ఉపాధ్యక్షుడిగా తిప్పయ్య సభ్యులుగా నారాయణస్వామి, బాషా, వెంకటేష్, తిరుపతయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, రాము, అమీనమ్మ.. హరిక్రిష్ణ, రామాంజనేయులు, రామక్రిష్ణ, రాము, గంగాధర్, తిరుపతయ్య, అరుణమ్మ, ఆనంద్‌కుమార్, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణ యూనిట్లు పెంచాలి

గుంతకల్లు రూరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిని కల్పించే క్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాల యూనిట్ల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామీణ పౌర సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యుడు లాలిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గుంతకల్లు మండలానికి కేవలం 35 బీసీ రుణాలను మాత్రమే మంజూరు చేయడం అన్యాయమన్నారు. గతంలో ప్రతి గ్రామానికి 15 నుంచి 20 యూనిట్ల మేర బీసీ రుణాలను మంజూరు చేస్తే..ప్రస్తుత ప్రభుత్వం మండలం మొత్తానికి కేవలం 35 యూనిట్లను మంజూరు చేయడమేంటని ప్రశ్నించారు. రుణ యూనిట్ల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

హెల్మెట్ ఉపయోగంపై బైక్ ర్యాలీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు హెల్మెట్ వాడకంపై శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీ హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాన్ని నడిపి ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ల ఉపయోగంపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లను ఉపయోగించాలని బ్యానర్ల ద్వారా వివరించారు. ర్యాలీలో అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ ధరణిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోటను అభివృద్ధి చేయండి

గుత్తి: గుత్తి కోటను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని పురావస్తు శాఖ సీనియర్ కన్జర్వేటివ్ అసిస్టెంట్ రాజా యోగీష్‌కు గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్ విన్నవించారు. అనంతపురంలోని పురావస్తు శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన రాజా యోగీష్‌ను కలిశారు. ఈ సందర్భంగా గుత్తి కోట చరిత్ర, గొప్పతనం గురించి చర్చించారు. గుత్తి కోటను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా జంగిల్ క్లియరెన్స్‌ను వెంటనే చేపట్టాలని విన్నవించారు. అందుకు పురావస్తు శాఖ అధికారి సానుకూలంగా స్పందించినట్లు విజయ భాస్కర్ తెలిపారు.

చిరుతల సంచారంతో బెంబేలు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో చిరుత పులులు సంచరిస్తుండడంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 15 రోజుల క్రితం ఓ తోట వద్ద చిరుతలు కుక్కను చంపి తిన్న అనవాలు రైతులు గుర్తించారన్నారు. అలాగే సోమవారం ఉదయం మరో కుక్కను చిరుతను చంపి తినిందన్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో అటవీ భూములు అధికంగా ఉండడంతో చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి పందులు వ్యవసాయ పొలాల్లోకి వచ్చి రైతులు, ప్రజలు, గొర్రెల కాపర్లు, గొర్రెల మందపై దాడులు చేసే అవకా శం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు అడవి చుట్టూ లోతైన ట్రెంచులు తీయకపోవడంతో చిరుతలు పొలాల్లోకి వచ్చి దాడులు చేస్తున్నాయన్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

ప్రారంభమైన రైల్వే పనులు

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో సోమవారం అమృత్ మహోత్సవం కింద తిరిగి పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని రోజుల విరామం తరువాత పనులు జరుగుతున్నాయి. దాదాపు రూ.11కోట్ల వ్యయంతో స్టేషన్‌ను ఆధునికీకరణ చేస్తున్నారు. స్టేషన్‌కు ముందుభాగంలో ఉన్న స్టీల్ కడ్డీలు, టికెట్ బుకింగ్ కేంద్రం పైభాగంలోని ప్రహరీని కూలీలు తొలగిస్తున్నారు.

మెగా డీఎస్సీ పేరుతో చంద్రబాబు దగా



మాట్లాడుతున్న అబ్దుల్‌బాసిద్

గుంతకల్లుటౌన్: అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని విడుదల చేసి టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ నిరుద్యోగ యువతను దగా చేశారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ విమర్శించారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల పూర్తయినా సీఎం చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిరుద్యోగుల్ని మోసం చేశారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం చేతకాని బాబు తన తనయుడు లోకేష్‌కు మాత్రం మంత్రి కొలువు ఇచ్చాడన్నారు. కేవలం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడానికి సర్కారు మీన మేషాలు లెక్కించడం సిగ్గుచేటన్నారు. విద్యామంత్రి నారాలోకేష్ పాదయాత్రలో చెప్పిన జాబ్ క్యాలెండర్‌కు దిక్కులేదన్నారు. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒకే ఒక్క నోటిఫికేషన్‌తో 1.25 లక్షల శాశ్వత ఉద్యోగాలిచ్చి విశ్వసనీయతను చాటుకున్నారన్నారు. ఈ విద్యాసంవత్సరంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోతే యువత సత్తా ఏంటో చూపెడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు ప్రతాప్, జాఫర్, ప్రశాంత్, మనోజ్, దిలీప్, మధు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



తాడిపత్రిలో చిన్నారులచే అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



పామిడిలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్/పామిడి: సరస్వతీ దేవి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని తాడిపత్రి పట్టణంలోని సరస్వతీ విద్యామందిర్‌లో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యామందిర్‌లో చదువుకుని వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థి రాఘవరెడ్డి సుమారు రూ.20 లక్షల వ్యయంతో విద్యామందిర్‌లో సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే పామిడిలోని భోగేశ్వరాలయంలో వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని శోభాయానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. తల్లుల సమక్షంలో చిన్నారులకు అమ్మవారి సన్నిధిలో బియ్యం, కొత్త పలకలపై అర్చకుడు చంద్రమౌళి అక్షరభ్యాసం చేయించారు

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

గుంతకల్లు: ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానిక హనుమేష్ నగర్‌లోని బీసీ బాలిక హాస్టల్‌లోని విద్యార్థులకు 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మీ భవిష్యత్‌కు పునాది లాంటిదన్నారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉండటంతో సమయం వృథా చేయకుండా కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో స్టడీ మెటీరియల్ దాత, భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహకుడు యు.సుధాకర్‌చౌదరి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి నీలకంఠ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ జ్ఞానమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.